క్లుప్తంగా

నేడు 35 యర్లంపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని 35 యర్లంపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. గర్భిణులకు గుండె, బీపీ, షుగర్, థైరాయిడ్ సంబంధిత పరీక్షలు చేసి సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించండి


విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

గుడిపాల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని బొమ్మసముద్రం జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శరత్‌చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని గట్రాళ్లమిట్ట, గురుగునత్తం, నంగమమగళం, మంధ్రిక్రిష్టాపురం గ్రామాల్లో ఆదివారం అధ్యాపకులు ఇంటింటా ప్రచారం చేశారు. ప్రభుత్వ కళాశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో తెలియజేశారు. సోమవారం నుంచి అడ్మిషన్స్‌కు రావలసిందిగా కోరారు. ఉచితంగా పాఠ్యపుస్తకాలు, టీవీ పాఠాలు, ఇంగ్లీషు మాట్లాడడం, లైబ్రరీ సౌకర్యం, మధ్యాహ్న భోజనం సౌకర్యాలపై విద్యార్థులకు తెలియజేశారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఅండ్‌టీ, సెరికల్చర్ ఎంఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అడ్మిషన్ డ్రైవ్‌లో అధ్యాపకులు రెడ్డెప్పరెడ్డి, జ్యోతిర్మయి, శ్రీహర్ష, సీఆర్ అమర్ పాల్గొన్నారు.

గోసంరక్షణ ట్రస్టుకు విరాళం


నగదు విరాళం అందజేస్తున్న దాత

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన గోసంరక్షణ ట్రస్టుకు ఆదివారం ఓ దాత నగదు విరాళం చేశారు. గుంటూరుకు చెందిన దాత రాధాకుమారి, శివప్రసాద్ రూ.ఒక లక్ష ట్రస్టుకు అందజేశారు. ఈ నగదు అందుకున్న ఆలయ అధికారులు దాత కుటుంబానికి స్వామి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక


ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. మండల ప్రజలు అర్జీలు సమర్పించి తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరుకావాలని సూచించారు.

విద్యార్థుల సేవలు అ'పూర్వ'ం

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు చేస్తున్న సేవలు ఎనలేనివని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు మార్కండేయనాయుడు అన్నారు. ఆదివారం 1992–93లో పదో తరగతి చదివిన విద్యార్థులు తమ సొంత ఖర్చులతో పాఠశాలకు ఆవరణలో సరస్వతి విగ్రహం ప్రతిష్ఠించి 40 రోజులు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. మొట్ట రిటైర్డ్ హెచ్ఎం మార్కండేయనాయుడుకి పాదపూజలు చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో ప్రస్తుత హెచ్ఎం రఘుమందడి, సైన్స్ ఉపాధ్యాయుడు రమేష్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏటీఎంకు నిరంతరం తాళం

గుడిపాల: మండల కేంద్రంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం తెరుచుకునేదెప్పుడో అంటూ ఖాతాదారులు అడుగుతున్నారు. గత సంవత్సరం ఆగస్టులో ఏటీఎంలో నగదును దుండగులు చోరీ చేశారు. అప్పటినుంచి ఇప్పటిదాకా ఏటీఎం మాత్రం తెరచుకోలేదు. దీంతో ఖాతాదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే పలుమార్లు బ్యాంక్‌వారికి చెప్పినా కూడా పట్టించుకోలేదని ఖాతాదారులు వాపోతున్నారు. చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిలో ఉన్న ఈ ఏటీఎం ద్వారా ప్రతిరోజూ లక్షలాది రూపాయల లావాదేవీలు జరుగుతుండేవి. ప్రస్తుతం గుడిపాలలో టాటా ఇండిక్యాష్ ఏటీఎం మాత్రమే పనిచేస్తోంది. ఇందులో ఒక లావాదేవి రూ.10వేలు మాత్రమే వస్తోంది. మూడు లావాదేవీలు తరువాత ఒక్కో లావాదేవికి రూ.30 అదనంగా వసూలు చేస్తున్నారు. ఇకనైనా అధికారులు చొరవ తీసుకొని వెంటనే ఏటీఎం కేంద్రాన్ని పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



చిత్తూరు: కోదండరామస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు, గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామి వారు




తవణంపల్లె: అర్ధగిరిలో సీతారామలక్ష్మణులకు పూజలు చేస్తున్న అర్చకులు, ఎగువ మత్యంలో సీతారాముల కల్యాణోత్సవం




రామ రామ జయ సీతారామా!

- చిత్తూరు నగరంలో ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు
- పోటెత్తిన రామాలయాలు..మందిరాలు
- పలుచోట్ల ఘనంగా స్వామివారి కల్యాణోత్సవం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): శ్రీరామ నవమి వేడుకలు అంబారాన్నంటాయి. ఆలయాలు.. మందిరాలు భక్తజనంతో పోటెత్తాయి. రామజపంతో పులకించిపోయాయి. కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. ఉత్సవంలో పాల్గొని భక్తులు పునీతులయ్యారు. చిత్తూరు నగరంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. రాములుగుడివీధిలోని శ్రీకోదండరామస్వామి ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు నవమి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. స్వామి దర్శనార్థం భక్తులు ఎండను సైతం లెక్కచేయకుండా బారులుతీరారు. వీరి రాకతో ఆలయం కిక్కిరిసింది. భక్తులకు ఇబ్బందిలేకుండా దర్శన సేవలు అందించి కర్పూర హారతులు పట్టారు. ప్రసాద వితరణ చేశారు. బ్రహ్మోత్సవంలో భాగంగా స్వామి వారు ఉదయం హంస, రాత్రి సూర్య ప్రభ వాహనంలో కటాక్షించారు. నవమిని పురస్కరించుకుని పొన్నియమ్మ గుడివీధిలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో గరుడసేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారు గరుడ సేవలో విహరిస్తూ, భక్తుల నుంచి కర్పూర హారతులు అందుకున్నారు. గిరింపేటలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవం కమనీయంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పునీతులయ్యారు. రామజపంతో మార్మోగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.


గుడిపాల: కోలాటమాడుతున్న కళాకారులు

రామాలయాల్లో నవమి వేడుకలు

తవణంపల్లె: మండలంలోని అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో స్వామికి అభిషేకం, పూజలు చేశారు. అనంతరం శ్రీరామనవమిని పురస్కరించుకొని ఆలయ మండపంలో అర్చకులు సీతారామ లక్ష్మణులకు శాస్త్రోక్తంగా అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చనలు పూజలు చేసి ధూప దీపనైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా కల్యాణోత్సవం

మండలంలోని ఎగువ మత్యంలో వెలసిన కోదండరామాలయంలో నవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఆలయంలో స్వామికి అభిషేకం, అలంకరణ, పూజలు చేసి ధూప దీపనైవేద్యం సమర్పించారు. ఆలయంలో అర్చకులు భక్తితో సీతారాములు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా సంప్రదాయబద్ధంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామి అమ్మవార్ల కల్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు. భక్తులు అమ్మవారికి సారెలు పెట్టి, మొక్కులు చెల్లించుకున్నారు. ఆంజనేయస్వామి ఆలయంలో స్వామికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు చేశారు. టి.పుత్తూరు కోదండరామాలయంలో శ్రీరామ నవమి వేడుకలు శోభాయమానంగా నిర్వహించారు. ఆలయంలో అర్చకులు సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, అలంకరణ, పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామికి పూజలు చేసి భక్తితో తిరుమంజనం చేయించారు. జొన్నగురకలలో శ్రీరామనవమి సందర్భంగా అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

హంస వాహనంపై సీతారాముల విహారం

అరగొండ కోదండరామస్వామి దేవస్థానంలో నవమి సందర్భంగా ఆదివారం రాత్రి హంస వాహన సేవను ఉభయదారులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పూజా సామగ్రి, ప్రసాదాలు, పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు ఉత్సవమూర్తులు సీతారామలక్ష్మణులకు అభిషేకం, పూజలు చేయించి నైవేద్యం సమర్పించారు. అనంతరం సుగంధపుష్పాలు, విద్యుద్దీపాలంకరణతో అలంకరించిన హంస వాహనంపై సీతారామ లక్ష్మణులు కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను పరమవశించారు. భక్తులు స్వామికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర, మంగళహారతులిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

కోదండరాముని కల్యాణోత్సవం

యాదమరి: కోదండరాముని కల్యాణోత్సవం అశేష భక్తవాహిని మధ్య వైభవంగా సాగింది. స్థానిక కోదండ రామాలయంలో సాయంత్రం సీతారాములకు ప్రత్యేక అభిషేకాదులు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు శ్యామ్‌శర్మ, హేమంత్ శర్మ ఆధ్వర్యంలో వేదపారాయణలతో పూజాధి కార్యాలు నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో సీతారాముల కల్యాణం వైభవంగా సాగింది. రాత్రి మండల కేంద్రంలోని పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు.






చిత్తూరు: కోదండరామస్వామి ఆలయంలో కిక్కిరిసిన భక్తులు, కోలాటమాడుతున్న మహిళలు, రాములవారి దర్శనం కోసం ఆలయ ఆవరణలో బారులు తీరిన భక్తులు, తవణంపల్లె: అర్ధగిరిలో భక్తులకు ప్రసాదాల పంపిణీ

కమనీయం.. సీతారాముల పరిణయం


పాలేరులో సీతారాముల కల్యాణోత్సవం

బంగారుపాళెం: శ్రీరామనవమి పండుగ పర్వదినం సందర్భంగా ఆదివారం మండలంలోని పాలేరు గ్రామంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉదయం రామాలయంలో శ్రీసీతారామ సమేత లక్ష్మణస్వామి, ఆంజనేయస్వామి మూల విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు పూజలు చేశారు. అనంతరం శ్రీరామచంద్రమూర్తి, సీతమ్మ ఉత్సవ విగ్రహాలను వధూవరులుగా అలంకరించి పెళ్లిపీటలపై కొలువుదీర్చారు. పురోహితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య సీతమ్మ, రామయ్యల పరిణయాన్ని వేడుకగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు సీతారాముల కల్యాణాన్ని తిలకించి, స్వామి, అమ్మ వారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సీతారాముల కల్యాణోత్సవానికి గ్రామానికి చెందిన దేవి, పూర్ణచంద్రారెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా 9 రోజుల పాటు హరికథా కాలక్షేమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రామాలయ వంశపారంపర్య ధర్మకర్తలు అనసూయమ్మ, మొగిలిరెడ్డి, గాయత్రి, చెంగల్‌రెడ్డి, రామ చంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


పాలేరులో సీతారాముల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

పలు గ్రామాల్లో అన్నదానం


గొల్లపల్లెలో నవమి పూజలు చేస్తున్న భక్తులు

గుడిపాల: భక్తుల జయ జయ ధ్వనాలు.. శ్రీరామ నామస్మరణల మధ్య శ్రీరామచంద్రుడు సీతాదేవిని పెళ్లాడాడు. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం మండలంలో పల్లూరు, 197రామాపురం, బసవాపల్లె, బొమ్మసముద్రం, నంగమంగళం, చిత్తపార, చీలాపల్లె, కోలావూరు గ్రామాల్లో సీతారాముల దేవాలయాల్లో రాములోరి కళ్యాణాన్ని వేదపండితుల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో సాయంత్రం దేవాలయాల వద్ద భక్తులు భజనలు చేశారు.


విశేషాలంకరణలో సీతారాములు

మొగిలివెంకటగిరిలో సీతారాముల గ్రామోత్సవం


బంగారుపాళెం: విశేషాలంకారంలో సీతారాముల మూలవర్లు


మొగిలివెంకటగిరిలో ఊరేగుతున్న సీతారామస్వామి వారు

బంగారుపాళెం: మండలంలోని మొగిలివెంకటగిరి గ్రామంలో గల పురాతన రామాలయం శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం రామాలయంలో శ్రీసీతారామ సమ్మేత లక్ష్మణ, ఆంజనేయస్వామి మూల విగ్రహాలకు అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చి పురవీధుల్లో మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి కర్పూర నీరాజనాలు సమర్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీరామనవమి సందర్భంగా భజన కార్యక్రమాలు, హరికథా కాలక్షేపం నిర్వహించారు. స్వామి వారిని దర్శిం చుకునేందుకు వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త తులసీరామ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, సర్పంచ్ దీప్తిరెడ్డి, ఆలయ చైర్మన్ ప్రకాష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

స్థానిక బ్రాహ్మణవీధిలోని రామాలయంలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. జెడ్పీ మాజీ చైర్మన్ కుమార్‌రాజా, సర్పంచ్ ఉమాదేవి, ఉప సర్పంచ్ కామరాజు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి సీతారాముల చిత్రపటాన్ని ఊరేగించారు. మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాల్లో శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో భక్తులకు పానకం, వడపప్పు ప్రసాదంగా పంపిణీ చేశారు.

మలుపులు.. ప్రమాద సూచికలు

- మలుపుల్లో కానరాని సూచిక బోర్డులు
- అతివేగంతో ప్రమాదానికి గురవుతున్న వాహనచోదకులు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు


ముత్తరపల్లెలో ప్రమాదకరమైన మలుపు


ముత్తరపల్లె చెరువు వద్ద ఉన్న మలుపు


టి.పుత్తూరు రోడ్లలో సూచికబోర్డు లేని మలుపు

తవణంపల్లె: మండలంలోని పలు ప్రధాన రహదారుల్లో మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. చిత్తూరు–అరగొండ ప్రధాన రహదారిలో సత్తార్‌బావి, ముత్తరపల్లె, ముత్తరపల్లె క్రాస్, దిగువ తడకర అరగొండ–గాజులపల్లె రోడ్లలోని మలుపులు ప్రమాదకరంగా మారాయి. ప్రధాన రహదారిలో కాణిపాకం, అరగొండ అర్ధగిరి క్షేత్రానికి, అరగొండ అపోలో హాస్పిటల్‌కు వెళ్లే వాహనాలతో నిత్యం రద్దీగా ఉంటోంది. ప్రధాన రహదారుల్లో రోజురోజుకూ వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. అత్యంత వేగంగా వాహనాలు నడపడం వల్లే ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇది ఇలా ఉండగా ప్రమాదాలు జరిగి గాయాలపాలైనా అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా నిరసన వ్యక్తం అవుతోంది.


సూచిక బోర్డులు కరువు

చిత్తూరు– అరగొండ ప్రధాన రహదారిలో అక్కడక్కడ సూచిక బోర్డులు కనిపిస్తున్నాయి. గాజులపల్లె– సరకల్లు, గాజులపల్లె–మాధవరం రోడ్లులో వేగ నిరోధక సూచికబోర్డులు జాడేలేదు. టి.పుత్తూరు రోడ్లులోని మలుపుల్లో సూచికబోర్డులు కనపడడం లేదు. సూచిక బోర్డు, ముళ్ల చెట్లు తొలగించకపోవడంలో ప్రమాదాలకు కారణమవుతోందని స్థానికులతో పాటు వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు.

స్పీడుబ్రేకర్లు ఏర్పాటు చేయాలి


చిత్తూరు– అరగొండ, చిత్తూరు– కాణిపాకం రోడ్లపై నిత్యం వాహనాలు రద్దీగా తిరుగుతుంటాయి. ఈ క్రమంలో వాహనాల వేగ నియంత్రణ కోసం మలుపు రోడ్లలో స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. స్పీడ్ బ్రేకర్లు ఉన్నచోట పెయింట్‌తో మార్క్ చేయించాలి. దీంతో కొంత మేరకు వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాదాలకు కళ్లెం వేయవచ్చు.

ఏర్పాటు చేయిస్తాం



చిత్తూరు– అరగొండ అర్ధగిరి, చిత్తూరు– కాణిపాకం ప్రధాన రహదారుల్లో వాహనాల రద్దీ వాస్తవం. వాహనాల వేగాన్ని నియంత్రించి ప్రమాలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. ఆర్‌అండ్‌బీ అధికారులతో చర్చించి ప్రధాన రహదారుల్లో సూచిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు వేయించి వైట్‌లైన్లు వేయించేలా చర్యలు తీసుకుంటాం. – చిరంజీవి, ఎస్ఐ, తవణంపల్లె

అధికారులు చర్యలు తీసుకోవాలి



ప్రధాన రహదారుల్లో ప్రమాదాలు జరగకుండా ప్రజలు ప్రాణాలు కాపాడడానికి అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలి. ప్రధాన రహదారుల్లో వేగనియంత్రణకు చర్యలు లేకపోవడం వల్ల వాహన చోదకులు ప్రమాదాలకు గురై సామాన్యుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు చేపట్టాలి. – ఢిల్లీబాబు, మిట్టపల్లె

ప్రధాన రహదారులు వెడల్పు చేయాలి



ప్రధాన రహదారులు పూర్తిగా ఆక్రమణలకు గురైనవి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వారు ఆక్రమించుకుని కట్టడాలు కట్టారు. ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పోలీసు అధికారులు చొరవ చూపి సర్వే చేసి రోడ్లను విస్తరిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చు. ఇరుకైన రోడ్ల వల్ల, వాహనాలు వేగంగా నడపడం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. –రామచంద్రారెడ్డి, ఎగువ తవణంపల్లె

స్పీడుబ్రేకర్లు ఏర్పాటు చేయాలి



ప్రధాన రహదారిలోని మలుపు రోడ్లలో స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. స్పీడు బ్రేకర్లు, సూచిక బోర్డులు లేకపోవడం వల్ల నిత్యం ఎక్కడో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేసి వైట్‌లైన్స్ వేయించి ప్రమాదాలు జరగకుండా అరికట్టాలి. –మునేంద్ర, దిగువ తడకర

ఉపాధి వేతనం రూ.7 పెంపు


ఉపాధి పనుల్లో కూలీలు

గుడిపాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు చేసే కూలీలకు ఈ సంవత్సరం రూ.7 పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రోజుకు కనీస వేతనం రూ.307 చెల్లించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలో రోజుకు కనీస వేతనం రూ.300 ఉండగా, ఈ ఏడాది స్వల్పంగా రూ.7 పెంచారు. కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులు ఏప్రిల్ ఒకటి నుంచి అమల్లోకి వచ్చినట్లు ఏపీవో శ్రీనివాసులు తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు కేటాయించిన కొలతలతో పనులు పూర్తి చేస్తే వేతనదారులకు ప్రభుత్వం ప్రకటించిన గరిష్ట వేతనం అందనుంది. గత ఐదేళ్లలో పోల్చితే ఈ ఏడాది పెంచిన వేతనం తగ్గించినట్టేనని వేతనదారులు చెబుతున్నారు. 2020–21లో రూ.230 చెల్లించేవారు. 2022లో రూ.15, 2023లో రూ.12, 2024లో రూ.15, ఈ ఏడాది కనీస వేతనం రూ.7 పెంచడంపై వేతనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. . కుటుంబ పోషణకు ఉపాధి పనుల్లో పాల్గొనే శ్రమ జీవులకు మరి కొంత ఎక్కువ మొత్తంలో వేతనాలు పెంచాలని వేతనదారులు కోరుతున్నారు.